**తన రెండు ఎకరాల భూమి కోసం ప్రశ్నిస్తే గొడవలు, బండబూతులు, ఊళ్ళోంచి తరిమేస్తామన్న బెదిరింపులు... కాని మాతృభూమి పరిరక్షణలో ప్రాణాలర్పిస్తే జేజేలు... నీరాజనాలు... అంటరానివాళ్ళని ఆమడదూరంలో ఉంచినవాళ్ళే అక్కున చేర్చుకునే వైనాలు... కాని ఎవరిదీ 'మాతృభూమి'? ఎవరిదీ దేశం? ఎవరికోసమీ త్యాగం? అన్న ఆశీర్వాదం హృదయ ఘోషను ప్రతిఫలించిందీ కథ....**

# భూమి కోసం...

ఎస్.కుమార్



ఆశీర్వాదం కొడుకు సుందరం 'వీరమరణం' పొందాడు. 'శత్రువు' తుపాకి గుండు అతడి గుండెను చీల్చింది. 'మాతృభూమి' రక్షణ కోసం అతడు ప్రాణ త్యాగం చేశాడు. వీర జవాన్ సుందరం అంతిమయాత్రలో మిన్నంటిన నినాదాలు అతడి 'అసమాన త్యాగా'న్ని కీర్తించాయి.

ఆశీర్వాదానికి అంతా అయోమయంగా వుంది. తన చుట్టూ వున్న ప్రపంచం ఒక్కసారిగా తల్లకిందులైంది. తన కొడుకు సుందరం ఇంత హఠాత్తుగా ఈ దేశం 'ముద్దుబిడ్డ' ఎలా అయ్యాడో ఆశీర్వాదానికి అంతుబట్టకుండా వుంది.

ఓట్లు అడుక్కోడానికో, ప్రాణాలు తీయడానికో తప్ప ఎన్నడూ తను 'హరిజనవాడ'లో అడుగుపెట్టి ఎరుగని పెద్ద మనుషులు, పెద్ద కులస్తులు తన ఇంటి చుట్టూ చేరి సృష్టించిన హంగామా దృశ్యం ఆశీర్వాదం కళ్ళలో నిశ్చల చిత్రమై పాతుకుపోయింది. తనను కౌగలించుకొని 'గర్వపడాలం'టూ ఓదార్చిన చేతులు, 'వీరమాత'గా తన భార్య మరియమ్మను కీర్తించిన నోళ్ళు, వరాలు కురిపించిన పాలకుల ప్రేమ...తలచుకుంటుంటే ఆశీర్వాదానికి కాళ్ళ కింద నేల కదలబారింది.

అసలు తన కొడుకు సుందరం సైన్యంలో ఎందుకు చేరాడు?

నిలువెత్తు ప్రశ్న!

ఈ ప్రశ్న ఆశీర్వాదాన్ని గతంలోకి ఈడ్చుకుపోయింది

** ** **

బలమైన శరీరదారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం కలగలిసిన వ్యక్తిత్వం సుందరానిది. ఈ ప్రత్యేకతే ఆశీర్వావానికి శాపమై చుట్టుకుంది. ఊళ్ళో పెద్ద కులస్తుల పిల్లలతో నిత్యం గొడవపడి ప్రాణాలమీదకు తెచ్చుకొంటున్న కొడుకు అతనికి గుండెల మీద కుంపటిలా మారాడు. తలదించుకొని సర్దుకుపోవాలన్న తన జీవితానుభవం సుందరానికి అలవడనందుకు దిగులుపడ్డాడు. కొడుకుని మార్చడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

సుందరం ఇంటర్మీడియట్ తప్పడం ఆశీర్వాదానికి కాలం కలసివచ్చినట్టయింది. కొడుకు దూకుడుకు కళ్లెం వేసే అవకాశం దొరికినట్టయింది. కండబలమున్న కొడుకు కాయకష్టం చేసుకునైనా బతకగలడన్నది ఆయన ధీమా. మెల్లగా పొలం పనులకు సంబంధించిన బాధ్యతలన్నీ సుందరం భుజాన వేసి తను ఇంటిపట్టునే వుండటం ప్రారంభించాడు. గత్యంతరం లేక సుందరం వాటిని స్వీకరించాడు.

ఆశీర్వాదం సంతోషం ఎంతోకాలం నిలవలేదు. తన ఆశ అడియాశేనని తేలిపోయింది. సుందరం ఉడుకు నెత్తురు తండ్రికి కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. మునుపటికన్నా ప్రమాదకరమైన సమస్యలవి.

ఇంతకాలం తన ఈడు కుర్రాళ్ళతో గొడవలుపడ్డ సుందరం ఇపుడు ఏకంగా వాళ్ళ తండ్రులతోనే తలపడటానికి సిద్ధపడ్డాడు. భూస్వాములతో తలపడే శక్తిలేక ఎంతో కాలంగా తను వదిలేసుకున్న రెండెకరాల పొలం వివాదాన్ని సుందరం తిరగదోడటం ఆశీర్వాదానికి వణుకు పుట్టించింది. పెద్దవాళ్ళతో పెట్టుకుంటే బతకలేమన్న తండ్రి హితబోధలు సుందరాన్ని కదిలించలేకపోయాయి.

'నీచ కులస్తులు' ప్రశ్నించడాన్ని సహించలేని భూస్వాములు తొలి హెచ్చరికగా ఆశీర్వాదాన్ని, మరియమ్మను పిలిపించుకొని బూతులు తిట్టి పంపారు. హద్దు మీరి ప్రవర్తిస్తే దయతో విడిచిపెట్టిన ఆ ఎకరం పొలాన్నీ లాగేసుకుంటామని హెచ్చరించారు. సుందరం మరోసారి పొలం మాట ఎత్తితే నరికిపోగులు పెడతామని, కుటుంబాన్నంతా తన్ని తగలేస్తామనీ శపథం చేశారు.

సుందరానికి సర్దిచెప్పడం సాధ్యపడదని ఆశీర్వాదానికి అర్థమైపోయింది. సుందరం ఆవేశాన్ని అకారణంగా అణచివేయడం న్యాయం కాదని కూడా లోలోపల అనిపించింది. కానీ, గత అనుభవాలు ఆశీర్వాదం వెన్నులో చలిపుట్టించాయి. వాడ స్మశానమైన రోజులు, ప్రాణాలు గోనెసంచుల్లో మాంసపు ముద్దలైన అనుభవాలు, పోలీసులు, పాలకులు భూస్వాముల కొమ్ముకాసిన పచ్చి వాస్తవాలు ఆశీర్వాదం జ్ఞాపకాల్లో ఇంకా పచ్చిగానే వున్నాయి.

ఎలాగైనా కొడుకును కాపాడుకోవాలన్న ఆరాటం ఆశీర్వాదం ఏకైక లక్ష్యమైంది. మరియమ్మ కూడా రోజూ అదే పోరు. వెంటనే ఏదో ఒక పరిష్కార మార్గం ఆలోచించి తన బిడ్డ ప్రాణాలు దక్కించమని.

అదే సమయంలో చుట్టం చూపుగా తమ ఇంటికి వచ్చిన సుందరం మేనమామ సామేలు వారికి ఆపద్బాంధవుడిలా దొరికాడు. ఎలాగైనా సుందరాన్ని ఇక్కడనుంచి తప్పించి పుణ్యంకట్టుకోమంటూ మరియమ్మ తమ్ముడ్ని ప్రాధేయపడింది.

తన మత బోధలకు లొంగడన్న కోపం కొంత వున్నా తన చెల్లెలు కొడుకైన సుందరమంటే సామేలుకు అభిమానమే. క్రైస్తవ మత ప్రచారకునిగా తను అలవర్చుకున్న దయవల్లే కాకుండా మరో ప్రత్యేకమైన కారణంవల్ల కూడా ఇటీవల సుందరం పట్ల ఆయన ప్రేమ రెట్టింపయింది. ఒకరకంగా సామేలుకు సుందరం ప్రాణభిక్ష పెట్టాడనే చెప్పాలి.

ఆ మధ్య దేశవ్యాప్తంగా క్రైస్తవుల మీద, ప్రత్యేకించి మత ప్రచారకుల మీద జరిగిన దాడుల్లో సామేలు కూడా బాధితుడే.

మరో మతాన్ని నిర్మూలిస్తే గానీ తమ మతానికి మనుగడ లేదనుకునే 'ధర్మ పరిరక్షకులు' తన ఇంటిపై దాడిచేసి బీభత్సం సృష్టించిన రోజు సుందరమే అక్కడ లేకుంటే ఆరోజే సామేలు పరలోకం చేరుకుని వుండేవాడు. ఆనాడు తనకోసం సుందరం తిన్న దెబ్బల్లో ఏఒక్కటి సామేలుకు తగిలివున్నా చచ్చి వూరుకునేవాడు.

ఆశీర్వాదం, మరియమ్మ కూడా ఈ సంఘటనను స్వయంగా చూసినవారే.

తన కృతజ్ఞతా భారాన్ని దింపుకొనే అవకాశం ఇంత తొందరగా దక్కినందుకు సామేలు సంతోషపడ్డాడు. సుందరాన్ని తన వెంట తీసుకెళ్లి ప్రయోజకుడిని చేస్తానని మరియమ్మకు, ఆశీర్వాదానికి భరోసా ఇచ్చాడు. సుందరం అన్యమనస్కంగానే సామేలు వెంట వెళ్ళడానికి అంగీకరించాడు.

సుందరాన్ని ఏం చేయాలో సామేలుకు అంతుపట్టలేదు. తనతోపాటు మత ప్రచారంలోకి లాగేసుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు. సుందరం ససేమిరా మొగ్గు చూపలేదు. రోజులు గడిచేకొద్దీ అక్కడ వుండటం సుందరానికి కూడా విసుగెత్తించసాగింది. తిరిగి ఇంటికెళ్ళడానికి అంత ఆసక్తి కలగలేదు.

సుందరం తన దారికి రాదని గ్రహించిన సామేలు అతడ్ని ఏదో ఒక పనిలో ఇరికించి తన బాధ్యత తీర్చుకోవాలని

నిర్ణయించుకున్నాడు. ఈ విషయమై సహాయపడవలసిందిగా కొందరు మిత్రులను కోరాడు. అలా కోరిన వారిలో ఒకరు ఓరోజు సామేలు దగ్గరకొచ్చి చేతిలోని దినపత్రిక తెరిచి అందించాడు. సైనిక జవాన్లు కావాలంటూ వున్న ప్రకటన చూపించి కండబలం నిండుగా వున్న సుందరం తప్పక ఎంపికవుతాడంటూ సలహా ఇచ్చాడు.

చెల్లెలు కొడుకుని తన చేతులమీదుగా ఇటువంటి ఉద్యోగాల్లో చేర్పించడం సామేలుకు ఇష్టంలేకపోయినా చేసేదిలేక సుందరాన్ని పిలిచి విషయం చెప్పాడు. సుందరం ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. తాను ఎన్నడూ ఊహామాత్రంగానైనా ఆలోచించని విషయమది. తానూ జవాను కావచ్చునన్న విషయం అతనికి తొలిసారిగా తెలిసివచ్చింది. భవిష్యత్తు వీరోచితంగా, దేదీప్యమానంగా కనిపించింది. తన సత్తా నిరూపించుకోవడానికి ఇంతకన్నా సదవకాశం మరొకటి వుండదన్న నిశ్చయానికి వచ్చాడు.

సుందరం సైన్యంలో చేరడానికి ఇష్టపడ్డ విషయం సామేలు తన అక్క, బావలకు తెలియజేశాడు. మిలటరీ అనగానే కొంత భయపడ్డా, ఈ రూపాన్నా కొడుకు ప్రయోజకుడు అవుతాడని తల్లిదండ్రులు సరిపెట్టుకున్నారు. సుందరం సైన్యంలో చేరడానికి బయలుదేరిన రోజున అందరూ ఒక మహా ప్రళయం తప్పినట్టు గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నారు.

మరో ప్రళయానికి తెరలేచింది. దేశ సరిహద్దుల్లో యుద్ధం రాజుకుంది. రెండు దేశాలూ తమకు న్యాయంగా దక్కవలసిన భూమికోసం కత్తులుదూసుకున్నాయి. ఎవరి మాతృభూమికోసం వారు రక్తతర్పణలు మొదలు పెట్టారు. ఎంత రక్తాన్నయినా చిందిస్తాము కానీ వెనక్కు తగ్గమంటూ ఇరుపక్షాలు శపథాలు చేసుకున్నాయి. తుపాకీ గుండుకు అందనంత దూరంలో ఎక్కడో సుఖంగా భద్రజీవితం గడిపే దేశవాసులంతా వీర జవాన్లకు సంఘీభావం ప్రకటించారు. రక్తతర్పణాలకు కొరత వుండకూడదని రక్తదానాలు చేశారు. వీరమరణం పొందే వారి కుటుంబాలు వీధిన పడకుండా విరాళాలు ప్రకటించారు. పత్రికలు, టెలివిజన్లు, నాయకుల సభలు సమావేశాలు వారి కీర్తిని దిక్కులు పిక్కటిల్లేలా కీర్తించాయి. దేశభక్తి అంటే ఏమిటో తెలియని- కన్న మమకారాన్ని చంపుకోలేని తల్లిదండ్రులకు, అనుబంధం భగ్నం కావడాన్ని సహించలేని భార్యాపిల్లలకు మాత్రం యుద్ధం ఒక భయానక శాపం. ఎప్పుడు ఏ కబురు వినవలసి వస్తుందో తెలియని నరకం.

ఆ నరకం ఓరోజు ఉదయాన్నే కలెక్టర్ రూపంలో ఆశీర్వాదం తలుపు తట్టింది. అంతమంది పెద్ద మనుషులు ఒక్కసారిగా తన ఇంటికి రావడంతోటే ఆశీర్వాదానికి అంతా అర్థమైపోయింది. కలెక్టర్ భుజం తట్టి ఓదార్చాడు. ఓ మహిళా అధికారి మరియమ్మను అక్కున చేర్చుకొని సముదాయించింది. ఊరు ఊరంతా కదలివచ్చి సానుభూతి వ్యక్తంచేసింది. ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుందంటూ కలెక్టర్ ఫైల్లోంచి వరాల చిట్టా బయటకు తీశాడు. ఆశీర్వాదం, మరియమ్మ ఎక్కడివాళ్ళు అక్కడే కూలబడిపోయారు. కలెక్టర్ తన విధి తను చేసుకుపోతున్నాడు. రెండెకరాల పొలం, రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అంటూ ముగించాడు. మరో నాలుగు రోజుల్లో సుందరం మృతదేహం ప్రత్యేక విమానంలో ఇక్కడకు వస్తుందని, పూర్తి అధికార లాంఛనాలతో ప్రభుత్వమే అంత్యక్రియలు జరిపిస్తుందని చివరి మాట చెప్పాడు.

సుందరం శవం త్రివర్ణపతాకం కప్పుకొని విమానం దిగింది. పెద్ద పెద్ద మిలటరీ అధికారులు ఆ శవానికి సెల్యూట్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు శవపేటికపై పుష్పగుచ్చాలు వుంచారు. అంతిమయాత్ర ప్రారంభమైంది. దేశభక్తులంతా ఊరేగింపు తీశారు. 'ధర్మ పరిరక్షకులు' అగ్రభాగాన నిలిచారు. అమరవీరుని బలిదానాన్ని కీర్తించారు. అన్ని మతాలూ ఆత్మశాంతికి ప్రార్ధనలు చేశాయి. శవానికి చివరిసారిగా యుద్ధరంగాన్ని గుర్తుచేస్తూ సైనికులు గాలిలో కాల్పులు జరిపారు. సుందరం శవపేటికపై త్రివర్ణ పతాకం పక్కకు తప్పుకుంది. ఏ అచ్ఛాదనా లేని నిర్మలత్వంతో పరిశుద్ధుడైన సుందరాన్ని ఆరడుగుల గొయ్యి అక్కున చేర్చుకొని మట్టితో కప్పేసుకుంది.

** ** **

ఆశీర్వాదం తన నిలువెత్తు ప్రశ్నను లీలగా పోల్చుకోగలిగాడు. సుందరం అంతిమయాత్ర దృశ్యం మాత్రం అతని దృష్టిపథం నుంచి చెదిరిపోలేదు. తన జాతిని అంటరానిది చేసి ఊరి బయటకు నెట్టేసిన దేశం, తన భూమిని తనకు కాకుండా చేసిన భూస్వామ్యం, తన విశ్వాసానికి శిలువవేసిన ధర్మం, ఈ అధర్మాన్నంతా వెనకేసుకొచ్చిన రాజ్యం ఈనాడు తన కొడుకుని ఎందుకు కీర్తిస్తున్నాయో ఆశీర్వాదానికి అర్ధమయింది. 'మాతృభూమి' రక్షణ వెనుక వీళ్ళందరి ప్రయోజనాలు దాగి వున్నాయని బోధపడింది. తనది కాని భూమి కోసం సుందరం బలయ్యాడని తెలుసుకున్నాడు.

తన పిరికితనం వల్లే సుందరానికి ఈ దుర్గతి పట్టిందని ఆశీర్వాదం పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తన కొడుకు ఇక్కడే వుండి భూస్వాములతో పోరాడి వీరమరణం పొందనందుకు ఆ తండ్రి కసితీరా నొచ్చుకున్నాడు. ●

# మాటల్లో మార్పులు

అక్షరంలో ఒక అచ్చు తప్పకుండా ఉండాలి. కేవలం అచ్చు కూడా అక్షరమవుతుంది. అచ్చుకు ముందు ఒకటి, రెండు కాక మూడు హల్లులుండవచ్చు. అచ్చు తరువాత కూడా ఒకటి, రెండు లేక మూడు హల్లులుండవచ్చు. ఇవన్నీ కలిపి ఒకే అక్షరం అవుతుంది. ఉదాహరణకు 'అ' ఒక అక్షరం. 'క' ఒక అక్షరం. 'కార్' ఒక అక్షరం. 'స్త్రీ' ఒక అక్షరం. 'సార్త్ర్' ఒక అక్షరం.

ఇంగ్లీషు మాటల్లో పదాంతంలో సంయుక్తం ఉన్నా సాధారణంగా వచ్చి చేరే అచ్చు 'ఉ'. ఉదాహరణకు బోర్డ్ బోర్డు అవుతుంది. రికార్డ్ రికార్డు, అవార్డ్ అవార్డు, కార్డ్ కార్డు, ఫార్వర్డ్ ఫార్వర్డు, వార్డ్ వార్డు అవుతాయి. పార్ట్ పార్టు, కోర్ట్ కోర్టు, షర్ట్ షర్టు, ఛార్ట్ ఛార్టు అవుతాయి. రెస్ట్ రెస్టు, ఛెస్ట్ ఛెస్టు అవుతాయి. బెల్ట్ బెల్టు, సాల్ట్ సాల్టు అవుతాయి. పల్ప్ పల్పు, సెల్ఫ్ సెల్ఫు అవుతాయి. ప్రాంప్ట్ ప్రాంప్టు అవుతుంది. ఆబ్జెక్ట్ ఆబ్జెక్టు, సబ్జెక్ట్ సబ్జెక్టు అవుతాయి.

మనభాష- 28



డి.చంద్రశేఖరరెడ్డి

రెండు కంటే ఎక్కువ అక్షరాలున్న మాటల్లో పదాంతంలో ఉన్న హల్లును బట్టి అది ద్విరుక్తం కావడమో కాకపోవడమో ఉంటుంది. చివరి హల్లుకు ముందున్న అచ్చు దీర్ఘమయితే హల్లు అద్విరుక్తంగానే ఉంటుంది. ఉదాహరణకు రిబేట్ రిబేటు అవుతుంది. కాంక్రీట్ కాంక్రీటు అవుతుంది. చలాన్ చలాను అవుతుంది. ప్లాటూన్ ప్లాటూను అవుతుంది. కార్టూన్ కార్టూను అవుతుంది. ప్రిన్సిపాల్ ప్రిన్సిపాలు అవుతుంది. ఇంజినీర్ ఇంజినీరు అవుతుంది.

రెండుకాని, రెండుకంటే ఎక్కువగాని అక్షరాలున్న మాటల్లో చివరిహల్లు 'ర' కారమయితే దానికి ముందు హ్రస్వాచ్చు ఉన్నా 'ర' కారం ద్విరుక్తం కాదు. టీచర్ టీచరు అవుతుంది.

మీటర్, మీటరు, సెంటర్ సెంటరు, డ్రైవర్ డ్రైవరు, లివర్ లివరు, డాక్టర్ డాక్టరు, మేజర్ మేజరు, మైనర్ మైనరు, అటెండర్ అటెండరు అవుతాయి. పదాంతంలో 'న'కారం ఉన్నా ద్విరుక్తం కాదు. విలన్ విలను అవుతుంది. చైర్మన్ చైర్మను, స్పెయిన్ స్పెయిను, మిలియన్ మిలియను అవుతుంది.

పదాంతంలో 'ప' కారంగాని, 'ట' కారంగాని ఉన్నప్పుడు ద్విరుక్తం కావడం కనిపిస్తుంది. మేకప్ మేకప్పు, లాకప్ లాకప్పు అవుతున్నాయి. మేకపు, లాకపు అని అద్విరుక్తంగా కూడా ఉండవచ్చు. క్రికెట్ క్రికెట్టు, రాకెట్ రాకెట్టు, లాకెట్ లాకెట్టు, సీక్రెట్ సీక్రెట్టు అవుతాయి.

హలంత శబ్దాల మీద చేరే అచ్చు సాధారణంగా 'ఉ' అయినప్పటికీ పదాంతంలో తాలవ్య హల్లు ఉన్నప్పుడు 'ఇ' వచ్చి చేరుతుంది.

పదం చివర 'య' కారం ఉంటే 'ఇ' చేరుతుంది. బాయ్ బాయి, టాయ్ టాయి, రాయ్ రాయి అవుతాయి

చ కార జ కారాలతో ముగిసే మాటలచివర కూడా 'ఇ' చేరుతుంది. లంచ్ లంచి అవుతుంది. బెంచ్ బెంచి అవుతుంది. బీచ్ బీచి అవుతుంది. లాంచ్ లాంచి అవుతుంది.

గారేజ్ గారేజి, లగేజ్ లగేజి, బారేజ్ బారేజి, కాలేజ్ కాలేజి అవుతాయి. రేంజ్, రేంజి అవుతుంది. ఎక్స్ఛేంజ్ ఎక్స్ఛేంజి అవుతుంది. మైలేజ్ మైలేజి అవుతుంది. లాంజ్ లాంజి అవుతుంది.

సంయుక్త హల్లుతో అంతమయ్యే మాటల్లో కూడా చివరి హల్లు 'చ' కారం కాని 'జ' కారం కాని అయినట్లయితే చివర 'ఇ' చేరుతుంది. ఉదాహరణకు సెర్చ్ సెర్చి అవుతుంది. చర్చ్ చర్చి అవుతుంది. రిసెర్చ్ రిసెర్చి అవుతుంది.

బ్రిడ్జ్ బ్రిడ్జి అవుతుంది. బాడ్జ్ బాడ్జి, లాడ్జ్ లాడ్జి, స్లెడ్జ్ స్లెడ్జి, ప్లెడ్జ్ ప్లెడ్జి, జడ్జ్ జడ్జి, ఛార్జ్ ఛార్జి, డిస్చార్జ్ డిస్చార్జి అవుతాయి.

పదాంతంలోని 'జ' కారం దంత్యమయితే దీనిమీద 'ఇ' చేరదు, 'ఉ'యే చేరుతుంది. ఉదాహరణకు ప్రైజ్ ప్రైజు అవుతుంది. రిలీజ్ రిలీజు, లీజ్ లీజు, క్రీజ్ క్రీజు, ఫ్లవర్‌వాజ్ ఫ్లవర్ వాజు అవుతాయి.

పదం చివర 'ఇ' చేరిన మాటలలో కొన్నింటిని కొందరు దీర్ఘాంతాలుగా రాస్తారు. జడ్జీ, బారేజీ, గారేజీ, చర్చీ, బ్రిడ్జీ మొదలయినవిధంగా దీర్ఘాంతాలుగా రాయడం కనిపిస్తుంది.

తెలుగులో తాటాకు లాంటి మాటల్లో 'ట' కారం మీద 'ఆ' రాస్తున్నాం. ఈ మాటను విడదీసినప్పుడు తాటి+ఆకు అవుతుంది. 'ట' కారం మీద ఉన్న అచ్చు 'ఇ+అ' కలవడం వల్ల వచ్చింది. మామూలు 'ఆ' ఉచ్చారణకూ దీనికీ భేదం ఉంది. దీనికి తాలవ్యోచ్చారణ ఉంటుంది. ఇంగ్లీషు మాటల్లో bank, bat వంటి వాటిలో ఇటువంటి ఉచ్చారణే ఉంది. ఈ మాటలను తెలుగులో రాసేటప్పుడు బ్యాంకు, బ్యాటు అనీ బాంకు, బాటు అనీ రెండువిధాలుగా రాస్తున్నారు. 'య' కారం తాలవ్యం. ఆ మాటలో అచ్చు తాలవ్యం అని సూచించడానికి 'య'కారాన్ని రాస్తున్నారు. ఈ సంప్రదాయం ప్రాచీన శాసనాలలో కూడా ఉంది. మేకలు వంటి తెలుగు మాటల్నే మ్యాకలు అని రాయడం శాసనాలలో ఉంది. కాబట్టి 'య' ఒత్తు రాయడంలో దోషమేమీలేదు. కాని పదం ఉచ్చారణ మనకు తెలిసినప్పుడు ప్రత్యేకమయిన లిపి సంకేతం అవసరం ఉండదు. అందువల్ల బాయ్ అని రాస్తే సరిపోతుంది. రాంకు, టాంకు అని రాయవచ్చు.

ఇట్లా రాయడం వల్ల కొన్ని మాటలమధ్య భేదం తొలగిపోతుంది. ఉదాహరణకు battle, bottle అనే మాటల్ని తీసుకోవచ్చు. ఈ రెండింటినీ బాటిల్ అనే రాయాలి. ఒక మాటకు యుద్ధం అనీ, మరోమాటకు సీసా అనీ అర్థం. ఒకేవిధంగా రాసినా సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.